క్లుప్తంగా

చర్చికి మైక్‌సెట్ వితరణ



మైక్‌సెట్ అందజేస్తున్న దృశ్యం

తనకల్లు: మండలంలోని దేవళంతండాలో ఉన్న విశ్వవాణి చర్చికి ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మైక్‌సెట్ అందజేశారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ కళ్యాణ్‌బాబు మాట్లాడుతూ.. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన బాల్య మిత్రుడు విజయకుమార్ రాజు జ్ఞాపకార్థం రూ.35 వేలు విలువ జేసే మైక్‌సెట్‌ను ఎంజీ రెడ్డి అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్, సమరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

భర్తపై కేసు నమోదు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని జౌకలపాలెం వీధికి చెందిన ఖాజామోహిద్దీన్‌పై భార్య షేక్ మోహనీష్‌తాజ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు.. కుటుంబ వ్యవహారంలో ఖాజామోహిద్దీన్ శనివారం రాత్రి గొడవపడ్డాడు. భార్య షేక్ మోహనీష్‌తాజ్, ఆమె తమ్ముడు అర్షద్‌పై దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలు షేక్ మోహనీష్‌తాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

ఘనంగా కనకదాస జయంతి



కనగానపల్లిలో జ్యోతుల ఊరేగింపు

కనగానపల్లి: మండల కేంద్రం కనగానపల్లిలో ఆదివారం భక్త కనకదాస జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కురుబ సంఘం నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి కురుబలు తరలివచ్చారు. బీసీ కాలనీలో కనకదాస చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. అనంతరం వందలాది మంది మహిళలతో బీసీ కాలనీ నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు జ్యోతులతో ఊరేగింపు నిర్వహించారు.

ట్రాన్స్‌ఫార్మర్ అపహరణకు విఫలయత్నం

నల్లచెరువు: మండల పరిధిలోని పెద్దయల్లంపల్లి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ అపహరణకు దుండగులు ప్రయత్నించారు. స్థానికులు తెలిపిన వివరాలు.. పెద్దయల్లంపల్లి సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని జయపాల్ నాయుడు నూతనంగా ఏర్పాటు చేస్తున్న హోటల్ రూం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. అయితే రాత్రి 8 గంటల ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని విలువైన రాగి వైర్‌ను ఎత్తుకెళ్లేందుకు గుర్తు తెలియని ఐదుగురు వ్యక్తులు యత్నించారు. స్థానికులు గమనించి కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రీస్తు జననంపై నాటికలోని ఓ దృశ్యం

కదిరి: పట్టణంలోని జోర్డాన్ బ్లెస్సింగ్ చర్చిలో పాస్టర్ టి.ఎం.విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఆదివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత చర్చిని సుందరంగా అలంకరించారు. క్రీస్తు జననానికి గుర్తుగా ఏర్పాటు చేసిన పశువుల పాక ఎంతగానో ఆకట్టుకుంది. ఏసుక్రీస్తును ఆరాధిస్తూ ప్రార్థన గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అంతకు ముందు రానున్న క్రిస్మస్ పర్వదినాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈనెల 16వ తేదీ నుంచి క్రిస్మస్ పండుగ వరకూ నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటించి పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తామని చర్చి పాస్టర్ సాగర్ తెలియజేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జాతీయ సమైక్యత అవార్డుల ప్రదానం

పుట్టపర్తి/పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మహబూబ్ బాషాకు జాతీయ సమైక్యత అవార్డు ప్రదానం చేశారు. ఇటీవల పెనుకొండ బాబయ్య ఉరుసు సందర్భంగా భారతీయ సూఫీ సత్పురుషుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో సర్వమత సమ్మేళన కార్యక్రమం జరిగింది. మైనారిటీ వెల్ఫేర్ సలహాదారుడు ఎంఏ షరీఫ్ చేతుల మీదుగా మహబూబ్ బాషా అవార్డు స్వీకరించారు. అలాగే ఖిద్మత్-ఏ-ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలకు గుర్తుగా ఆ ట్రస్ట్ సభ్యుడు షాకీర్‌కు జాతీయ సమైక్యత అవార్డు అందజేశారు.

జోరుగా ఆలయ నిర్మాణం

- యర్రదొడ్డి గంగమ్మ ఆలయానికి రూ.కోటి మంజూరు చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- 2021లో దేవదాయ శాఖ పరిధిలోకి..
- మరో మూడు నెలల్లో ఆలయ పనులు పూర్తయ్యే అవకాశం



శరవేగంగా జరుగుతున్న యర్రదొడ్డి గంగమ్మ ఆలయ నిర్మాణ పనులు

కదిరి అర్బన్: మండలంలోని యర్రదొడ్డి గ్రామ సమీపంలో వెలసిన యర్రదొడ్డి గంగమ్మ ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. భక్తుల కొంగు బంగారంగా పిలువబడుతున్న గంగమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఉగాది పర్వదినం అనంతరం ఇక్కడ అమ్మవారికి వందల సంఖ్యలో జంతువులను బలి ఇచ్చి, మొక్కులు తీర్చుకుంటారు. రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుతుండటంతో ఆదాయం కూడా రూ.లక్షల్లో వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ హయాంలో 2021 సంవత్సరంలో ఈ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకొచ్చారు. చాల ఏళ్ల క్రితం నిర్మించిన గంగమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో జీర్ణోద్ధరణకు శ్రీకారం చుట్టారు. ఆలయ అభివృద్ధికి గత ప్రభుత్వ హయాంలో దేవదాయశాఖ కామన్ గుడ్ ఫండ్ కింద రూ.కోటి మంజూరైంది. దీనికి తోడు ఆలయ కాంట్రిబ్యూషన్ (విరాళాలు, పార్కింగ్ ఫీజు, హుండీ ఆదాయం తదితరాలు) రూ.25 లక్షలు మొత్తం రూ.1.25 కోట్ల వ్యయంతో ఆలయ పునర్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం నూతన ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో మూడు నెలల్లో ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు చెబుతున్నారు.



యర్రదొడ్డి గంగమ్మ మూలవిరాట్

ఫస్ట్ ఫ్లోర్ అయిపోతుంది..

ఈ వారంలో ఫస్ట్‌ఫ్లోర్ నిర్మాణం పూర్తవుతుంది. మరో వారంలో రెండో ఫ్లోర్ కూడా నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం అమ్మవారు ఉన్న ప్రదేశంలో ఒక ఫ్లోర్ పూర్తి అయిపోంది. ఆలయంలో ఇంకా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పూర్తిస్థాయిలో ఆలయ నిర్మాణం పూర్తవుతుంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.
– రవీంద్రరాజు, ఆలయ ఈఓ.

మహిమ గల దేవత



యర్రదొడ్డి గంగమ్మ మహిమగల అమ్మవారు. ఇక్కడికి కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా భక్తులు వస్తుంటారు. ఇక్కడ ఏమైన మొక్కుకుంటే అమ్మవారు తప్పక నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఆలయ పునర్ నిర్మాణంతో భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి.
– సునీతబాయి, కదిరి

ఆదర్శప్రాయుడు పొట్టి శ్రీరాములు

ధర్మవరం అర్బన్: రాష్ట్రం కోసం ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు జూటూరు రమణయ్య తెలిపారు. పట్టణంలోని కాలేజీ సర్కిల్‌లో ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొట్టి శ్రీరాములు పట్టుదలను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి పిన్ను అశోక్, ట్రెజరర్ తబ్జుల్ శ్రీనివాసులు, దేవాలయ కమిటీ చైర్మన్ పిన్ను ప్రసాద్, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు రూపరాగిని, ట్రెజరర్ మంజుసంయుక్త, సభ్యులు గ్రందే శ్రీనివాసులు, బండ్లపల్లి రంగనాథ్, తలుపుల ప్రసాద్, రేపాకుల రాజశేఖర్, లక్ష్మీనారాయణ, కార్తీక్, రాఘవేంద్ర, మురళి, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆవోపా ఆధ్వర్యంలో..

పట్టణంలోని ఆవోపా ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఆవోపా జిల్లా ఇన్‌చార్జ్ అన్నా లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు డాక్టర్ శీబా నగేష్‌గుప్త, కార్యదర్శి కలవల కృష్ణకిషోర్, ట్రెజరర్ దొరణాల ఫణిరాజ్, శీబా సురేష్‌గుప్త, సాయికృష్ణ, ప్రసాద్ తదితరులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన గొప్పతనాన్ని వివరించారు.

కదిరి టౌన్: పట్టణంలోని టవర్‌క్లాక్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి వైఎస్సార్‌సీపీ నాయకులు లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాంప్రసాద్, ఖాశీం, నాయకులు పరికి సాధిక్ బాషా, గంగాధర్, ఈశ్వరయ్య, చాంద్‌బాషా, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరం అర్బన్: పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

తలుపుల: స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, కిట్టు, రవి, షబ్బీర్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో..

తాడిమర్రి: అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగ ఫలితంగా ఆంధ్ర రాష్ట్రం అవతరణ జరిగిందని గ్రంథాలయ అధికారి డీ.శీనానాయక్ పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం పాఠకులతో కలసి అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలనే పణంగా పెట్టిన ఆదర్శ ప్రాయుడు శ్రీరాములు అని కొనియాడారు.

ధర్మవరం/ధర్మవరం రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, డిప్యూటీ తహసీల్దార్ సునిత, రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ అంపయ్య, జూనియర్ అసిస్టెంట్ వరప్రసాద్, నరేష్‌కుమార్ రెడ్డి, డిప్యూటీ ఏఎస్‌ఓ గోపాల్, ఎంపీడీఓ సాయి మనోహర్, సూపరిండెంట్ అబ్దుల్ నబీ, సీనియర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో..

మహనీయులను స్మరించుకోవాలి

కనగానపల్లి/ చెన్నేకొత్తపల్లి: దేశ కోసం ప్రాణాలర్పించిన మహనీయులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మండల గ్రంథాలయాధికారి గోవిందు తెలిపారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌ల వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్ర పటాలకు ప్రజాప్రతినిధులు, గ్రంథాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం దేశం కోసం వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ అంకె రామక్రిష్ణ, గ్రామస్తులు తిప్పయ్య, రామలింగ, వీరనారప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లిలో..

మండల కేంద్రంలోని తహసీల్దార్, గ్రంథాలయ కార్యాలయాల్లో ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. తహసీల్దార్ సురేష్‌కుమార్ రెవెన్యూ సిబ్బందితో కలసి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నరసింహమూర్తి, వీఆర్వో లక్ష్మీనరసమ్మ, గ్రంథాలయాధికారి జయరాం పాల్గొన్నారు.

అమరజీవి వర్ధంతి నిర్వహణలో నిర్లక్ష్యం



ఎంపీడీఓ కార్యాలయానికి తాళం వేసిన దృశ్యం

బత్తలపల్లి: తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను మండల అధికారులు మరిచిపోయారు. తమిళ రాష్ట్రం నుంచి ప్రత్యేక తెలుగు రాష్ట్రంగా ఏర్పడడానికి పొట్టి శ్రీరాములు తన జీవితాన్నే పణంగా పెట్టారు. ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినంగా ఏటా డిసెంబర్ 15న అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఈ సంవత్సరం ఆదివారం (సెలవు రోజు) కావడంతో ఆత్మార్పణ దినం నిర్వహించలేదని తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినం నిర్వహించాలని ప్రత్యేక జీఓ విడుదల చేసినప్పటికీ దాని గురించి అధికారులు పట్టించుకోలేదు. మండల స్థాయి, గ్రామస్థాయిలో నిర్వహించాలని ఆదేశించినప్పటికీ ఎవ్వరూ చర్యలు చేపట్టకపోవడం విశేషం. రాష్ట్రం సాధించి పెట్టిన మహనీయుడి వర్ధంతినే అధికారులు మరిచారంటే వారి నిర్లక్ష్యం ఎంత ఉందో అర్థమవుతోందని ప్రజలు మండిపడుతున్నారు. ఇటువంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్ ఏర్పాటు


నల్లచెరువు: మండల పరిధిలోని గొర్లవాండ్లపల్లి గ్రామంలో ఇటీవల పంచాయతీ బోరుకు సంబంధించిన పైపులైన్ పగిలిపోయింది. గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఉబిచర్ల సర్పంచ్ బికారి సాబ్ ఆదివారం నూతన పైపులైన్ ఏర్పాటు చేయించారు. నీటి సమస్యను పరిష్కరించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

కవులకు సన్మానం

ధర్మవరం అర్బన్: అనంతపురం ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన, అభివృద్ధి కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో రాయలసీమ మహాకవి సమ్మేళనం నిర్వహించారు. ధర్మవరం యువ కవి, బీరే వేణుగోపాల్‌ను సన్మానించారు. వేమనపై వినిపించిన కవిత ఆకట్టుకుంది.

బత్తలపల్లి: అనంతపురంలోని ఎస్‌ఎస్‌బీఎన్ కళాశాలలో నిర్వహించిన 8వ రాయలసీమ మహాకవి సమ్మేళనంలో మాల్యవంతం గ్రామానికి చెందిన యువకవి సాకే అమర్నాథ్‌ను సన్మానించారు. దత్త మండలాల కేంద్రంగా అనంతపురం కలెక్టర్‌గా పని చేసిన థామస్ మున్రోపై రాసిన కవిత్వానికి గుర్తింపు లభించిందని సాకే అమర్నాథ్ తెలిపారు.

ఆకట్టుకున్న ఘంటసాల పాటల కచేరీ



కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కళాజ్యోతిలో ఆదివారం ఘంటసాల జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాజ్యోతి అధ్యక్షుడు కుంటిమల నారాయణ ఆధ్వర్యంలో ఘంటసాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతపురం, ధర్మవరం కళాకారులు హరిబాబు, బాలం శ్రీనివాసులు, వజదుల్లా, బండారు మురళి, రవికుమార్, శోభారాణి, రాజేశ్వరి తదితరులు ఘంటసాల పాటల కచేరీ నిర్వహించారు. అనంతరం వారిని కళాజ్యోతి నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు షమీవుల్లా, కళాజ్యోతి ఉపాధ్యక్షుడు రామకృష్ణ, డైరెక్టర్లు రాంప్రసాద్, మధుసూదన్, పల్లెం వేణుగోపాల్, జగ్గా వేణుగోపాల్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు మహాసభ

కదిరి టౌన్: పట్టణంలోని ఎన్‌జీఓ హోంలో ఈనెల 17వ తేదీన అఖిల భారత పెన్షనర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాసభ నిర్వహిస్తున్నట్లు పెన్షనర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బి.వి.శివారెడ్డి, కార్యదర్శి పి.ఆత్మారెడ్డి ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కదిరి ఆర్డీఓ, కదిరి డీఎస్పీ, జిల్లా ట్రెజరీ, అకౌంట్స్ ఆఫీసర్, చీఫ్ మేనేజర్ విశిష్ట అతిథులుగా వస్తారని పేర్కొన్నారు.

నీటి చౌర్యాన్ని అరికట్టాలి

తాడిమర్రి: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 41 చెరువులు నింపడానికి విడుదల చేసిన పీఏబీఆర్ కుడి కాలువ నీరు చౌర్యానికి గురికాకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ ధర్మవరం అసెంబ్లీ కన్వీనర్ జీ.గోపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాలువకు నీటిని విడుదల చేసి వారం రోజులు గడుస్తున్నా ఇప్పటికీ తాడిమర్రి మండల చెరువులకు చేరలేదన్నారు. పోలీసుల పహరా లేక పోవడంతో రాప్తాడు, కందుకూరు, మన్నీల తదితర ఎగువ ప్రాంతాల రైతులు తమ చెరువులను నింపుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సరిహద్దులో ఉన్న తాడిమర్రి మండల చెరువులను ముందుగా నింపాలన్నారు. ఎం.అగ్రహారం, తాడిమర్రి తూర్పు, పడమర, నార్పింపల్లి, నిడిగల్లు చెరువులు, ఏకపాదంపల్లి, పుల్లానారాయణపల్లి, మేడిమాకులపల్లి తదితర గ్రామాల్లోని కుంటలను నింపాలన్నారు. అయితే అధికారుల నిర్లక్ష్యం తాడిమర్రి మండల రైతులకు శాపంగా మారిందన్నారు. పై ప్రాంత చెరువులను నీటితో నింపుకుంటుండటంతో దిగువ చెరువులకు నీరు రాలేదన్నారు. దిగువ చెరువులకు నీరు చేరేలోపు నీటి విడుదల గడువు పూర్తవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యల్ప వర్షపాతంతో మండలంలో భూగర్భ జలాలు అడుగంటి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ తరుణంలో పీఏబీఆర్ కాల్వ నీటిపైనే రైతులు ఆశలు పెట్టుకున్నారని పేర్కొన్నారు. రైతులకు న్యాయం చేయకపోతే ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రేగాటిపల్లికి వెళ్లే దారిలోని భైరవ స్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సిద్దయ్యగుట్టకు చెందిన విశ్వనాథ్ తన కూతురు జ్యోతిని ద్విచక్ర వాహనంలో ఎక్కించుకుని రేగాటిపల్లి గ్రామానికి బయలుదేరాడు. భైరవ స్వామి గుడి వద్ద మట్టి రోడ్డులో నుంచి కారు వేగంగా వచ్చి రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశ్వనాథ్‌కు తీవ్ర గాయాలు కాగా.. కూతురు జ్యోతి సురక్షితంగా బయటపడింది. గమనించి స్థానికులు వెంటనే విశ్వనాథ్‌ను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి



ధర్మవరం అర్బన్: సత్యనారాయణ స్వామి వ్రతం ఆచరిస్తున్న దంపతులు



పుట్టపర్తి టౌన్: అన్నదానం చేస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మెంబర్ ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి టౌన్: అజ్ఞానమే అంధకారాన్ని తొలగించి లోకానికి వెలుగు రేఖలు ప్రసరింప చేసిన దత్తాత్రేయ జయంతి వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణంలో 6వ వార్డు సమాధి రోడ్డులో వెలసిన దత్తాత్రేయ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. వందలాది మంది భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఉయయాన్నే గణపతి, రుద్ర స్వాహాకార, దత్త హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముఖ్యంగా బాలవటువుకు చేసే నామకరణం భిక్షాటన చౌలం, బ్రహ్మోపదేశం శాస్త్రోక్తంగా చేపట్టారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మెంబర్ ఆర్‌జే రత్నాకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి భజన చేశారు. మహా మంగళ హారతుల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సాయినగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం షిర్డీ సాయిబాబా మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు దత్తాత్రేయ స్వామికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, గణపతి, నవగ్రహ, రుద్ర, దుర్గా, దత్తాత్రేయ తదితర హోమాలు చేపట్టారు. అనంతరం ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. 17 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు. భక్తులందరికీ అన్నదానం చేశారు.

పదో తరగతి మోడల్ పేపర్ల ఆవిష్కరణ

పుట్టపర్తి అర్బన్: యూటీఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన పదో తరగతి మోడల్ పేపర్లు, స్టడీ మెటీరియల్‌ను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల చేత మోడల్ పేపర్లను తయారు చేయించినట్లు తెలిపారు. మోడల్ పేపర్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో వీటిని ముద్రించినట్లు చెప్పారు. పదో తరగతి విద్యార్థులందరికీ మెటీరియల్ అందజేస్తామన్నారు. 100 రోజుల ప్రణాళికకు అనుకూలంగా వీటిని రూపొందించినట్లు పేర్కొన్నారు. వీటిని క్షుణ్ణంగా చదివితే 80 శాతం మార్కులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివ కందుకూరి, లక్ష్మీనారాయణ, కిష్ట, సుధాకర్, ఇర్షాద్, రమేష్, జనార్దన్, బాబా, బాబయ్య పాల్గొన్నారు.



మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న ఆర్‌జే రత్నాకర్, యూటీఎఫ్ నాయకులు

సత్ప్రవర్తనతో మెలగాలి

ధర్మవరం అర్బన్: క్షణికావేశంలో చేసిన తప్పులకు జైలు జీవితం గడుపుతున్నారు. మిమ్మల్ని మీరు మార్చుకునేందుకే జైలులో ఉన్నారు. సత్ప్రవర్తనతో మెలిగి అందరి మన్ననలు పొందాలని రాజస్థాన్‌లోని మౌంట్ అబూ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమార్ భగవాన్ భాయ్ తెలిపారు. పట్టణంలోని సబ్‌జైలులో ఆదివారం చర్య, ప్రవర్తన, స్వచ్ఛత అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది జైలు జీవితంగా అనుకోకుండా మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకోవడానికి ఇక్కడ ఉన్నామని అనుకోవాలన్నారు. ప్రతీకారం తీర్చుకునే బదులు తమను తాము మార్చుకునే ధోరణిని కలిగి ఉండాలని సూచించారు. చెడు అలవాట్లు విడనాడాలని సూచించారు. ప్రతి ఒక్కరూ జైలు నుంచి విడుదల అయ్యాక కొత్త జీవితం మొదలు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం సభ్యులు శ్రీనివాసులు భాయ్, జైలు సూపరింటెండెంట్ బ్రహ్మరెడ్డి, బ్రహ్మకుమారీస్ రాజ్‌యోగ సేవా కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ రాధా బెహన్, సబ్‌జైలు హెడ్ కానిస్టేబుల్ శివరామకృష్ణ, కానిస్టేబుల్ శివనాగేశ్వర్, సుధాకర్‌భాయ్, క్రాంతిభాయ్, రాజుభాయ్, అశోక్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భగవాన్ భాయ్

ఆరుగురి అరెస్ట్

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల గ్రామం సమీపంలోని రాజారెడ్డి తోట వద్ద ఆదివారం జూదం ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5,240 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపారు.

‘సూపర్ సిక్స్’ అమలు చేయరా?

బత్తలపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా గ్రామాల అభివృద్ధికి ఎలాంటి నిధులు విడుదల చేయలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత సంఘం, చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి మండిపడ్డారు. ఆదివారం మండలంలోని పోట్లమర్రి, వేల్పుమడుగు గ్రామాల్లో సీపీఐ ఆధ్వర్యంలో గ్రామ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటై ఆరు నెలలు అవుతున్నా పథకాలు అమలు చేయలేదని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘సూపర్ సిక్స్’ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని తెలియజేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో సీపీఐ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మాల్యవంతం కుళ్లాయప్ప, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు రమణ, బత్తలపల్లి మండల కార్యదర్శి బండల వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వద్దె సన్నపెద్దన్న, చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట స్వామి, రైతు సంఘం మండల కార్యదర్శి రామకృష్ణ, బత్తల నాగభూషణ, సత్తెప్ప, వెంకటప్ప, పూజారి, వేణుగోపాల్, రాందాసు తదితరులు పాల్గొన్నారు.



పోట్లమర్రిలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు